## సహస్ర కుటుంబాన్ని ఆదుకుంటాం

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**



సహస్ర తల్లిదండ్రులను ఓదారుస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జూన్ 18 : కామాంధుడి చేతిలో బలైపోయిన సహస్ర కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో చిన్నారి తల్లిదండ్రులు ఎల్కరి సాలక్క-మహేశ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనప్ప కలెక్టర్‌ను కలిశారు. వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ సహస్ర తల్లిదండ్రులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సహస్ర కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని, ఇంటర్ చదివిన సహస్ర తల్లికి ఒప్పంద ఉద్యోగిగా అవకాశం కల్పిస్తామన్నారు. దహెగాం తహసిల్దార్ కవిత, అధికారులు ఉన్నారు.

## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎదుట నిరసన



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎదుట నిరసన తెలుపుతున్న సామాజిక కార్యకర్త భూమాచారి

జన్నారం, జూన్ 18 : మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు వచ్చిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు వద్ద ఓ వ్యక్తి నిరసన తెలిపాడు. జన్నారం ఫారెస్టులో వాహనాల రాకపోకలపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు పలు డిమాండ్‌లతో కూడిన ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యలను సంబంధిత మంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.




దండేపల్లిలో ర్యాలీ తీస్తున్న సీపీఐ నాయకులు

## పేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి

**● సీపీఐ డిమాండ్ ● దండేపల్లిలో ర్యాలీ ● తహసీల్దార్‌కు వినతి**

దండేపల్లి, జూన్ 18 : పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయడంతో పాటు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దండేపల్లిలో ర్యాలీ తీశారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి పెర్క రాజేశ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సర్కారు స్పందించాలని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దేవవరం, భూమన్న, తదితరులు ఉన్నారు.



పట్టుబడ్డ వాహనం వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు, నిందితులు

## ఆవుల అక్రమ రవాణాను అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్

చింతలమానేపల్లి, జూన్ 18 : మండలంలోని గూడెం అంతర్రాష్ట్ర వంతెన వద్ద టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మాహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్ వైపు వస్తున్న వ్యాన్‌ను అడ్డుకొని తనిఖీ చేయగా అందులో 10 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. ఆపై సరైన పత్రాలు లేని వాహనాన్ని సీజ్ చేశారు. 10 ఆవులను చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యప్రదేశ్ షెమోల్ గ్రామానికి చెందిన డ్రైవర్ నిరంజన్ శర్మ, క్లీనర్ మదన్‌సాకేత్లాను అదుపులోకి తీసుకున్నారు. బెజ్జూర్ మండలం కుకుడకు చెందిన ఇర్ఫాన్ వద్ద తాము పని చేస్తున్నామని, అతని సూచనల మేరకే ఆవులను తరలిస్తున్నామని వారు తెలిపారు. ప్రస్తుతం ఇర్ఫాన్ పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ వెంకటేశ్, కానిస్టేబుల్ సంజీవ్, రమేశ్, మధు ఉన్నారు.

# బదిలీపై వెళ్తాం.. కొత్తవారొస్తారు

**● ధరణి పనులకు బ్రేక్**

**పెండింగ్ ధరణి దరఖాస్తులపై చేతులెత్తేసిన అధికారులు**

**● ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు ● రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న జనం**

*"పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా వచ్చిన రెవెన్యూ అధికారులు తిరిగి బదిలీ కోసం ఎదురు చూస్తున్నారు. త్వరలో ట్రాన్స్‌ఫర్స్ ఉంటాయని తెలియడంతో పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేస్తున్నారు. ఆ బిజీలో ధరణి అప్లికేషన్లను పట్టించుకోవడం లేదు. కార్యాలయాలకు వెళ్లిన వారికి వారం, పది రోజుల్లో కొత్త అధికారులు వస్తారు. ఇప్పుడు మేం మూమెంట్ చేసినా బదిలీ అయ్యాక ఆగిపోతది. కొన్ని రోజులు ఆగి కొత్తవారు వచ్చాక చేయించుకుంటే పని అయిపోతది అని చెప్పి పంపిస్తున్నారు."*

మంచిర్యాల, జూన్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రెవెన్యూ కార్యాలయాల్లో పనులకు బ్రేక్ పండింది. రికార్డుల్లో మార్పులు-చేర్పులతో జనం ఇబ్బంది పడకూడదనే సదుద్దేశంతో కేసీఆర్ సర్కారు ధరణి వెబ్‌సైట్‌ను తీసుకొచ్చింది. దీంతో భూమి అమ్ముకోవాలంటే దాని యాజమాని వచ్చి వేలిముద్ర పెడితే తప్పా, వేరే ఎవ్వరికీ ఆ అధికారం ఉండదు. ఈ క్రమంలో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించే అధికారం క్షేత్రస్థాయి లో ఎవ్వరికీ ఇవ్వకుండా కలెక్టర్లకు అప్పగించింది. ఫలితంగా పారదర్శకత పెరిగింది. దీంతో కలెక్టర్లు పని ఒత్తిడి, ఇతరాత్ర పనుల్లో బిజీగా ఉండడంతో కొన్నేళ్లుగా వేలాది ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోయాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించింది. మార్చి 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు కలెక్టర్లకు ఉన్న అధికారాలను ఆర్డీవో, తహసీల్దార్లకు అప్పగించింది. మ్యూటేషన్, సక్సెషన్, పీవోబీ సమస్యలు, సెమీ అర్బన్ ఏరియాల్లో పట్టాదారు పాస్‌బుక్స్ సమస్యలు, కోర్టు తీర్పులను అనుసరించి పాస్‌బుక్స్ జారీ, ఇండ్లు, నివాస స్థలాలుగా మారిన భూముల నాలా కన్వర్షన్‌ను కలెక్టర్లకు ఉంచి.. మిగిలిన సమస్యల పరిష్కారాన్ని ఆర్డీవోలు, తహసీల్దార్‌లకు అప్పగించింది.

### పరిశీలనకే సరి

కాంగ్రెస్ ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ పేరిట ప్రతి మండలంలో రెండు బృందాలను ఏర్పాటు చేసింది. తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్లు, గిర్దావర్ల ఆధ్వర్యంలో ఈ బందాలు పని చేశాయి. పది గ్రామాలకు ఒక టీం పంచుకుని పని చేశాయి. కాగా.. మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకే సమయం సరిపోయింది. దీంతో మార్చి 17వ తేదీ వరకు గడువు పెంచారు. ఈ లోగా లోక్ సభ ఎన్నికలు రావడంతో రెవెన్యూ అధికారులు ఎన్నికల పనుల్లో బిజీ అయ్యారు. ఈనెల 13న ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రభుత్వం తిరిగి ధరణి పెండింగ్ దరఖాస్తులపై దృష్టి సారించింది. ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. రోజుకు కనీసం 100 దరఖాస్తులను పరిష్కరించాలనే టార్గెట్ విధించింది. కానీ.. పనులు ముందుకు సాగడం లేదు. సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశతో వచ్చిన జనాలు తిరిగి వెళ్లిపోతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడ చూసినా దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తున్నది.

### మంచిర్యాలలో 6,751 అప్లికేషన్స్ పెండింగ్..

స్పెషల్ డ్రైవ్ మొదలైనప్పుడు మంచిర్యాల జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల సంఖ్య 7,250 ఉండగా.. ప్రస్తుతం 6,751కి వచ్చింది. అంటే నాలుగు నెలల్లో కేవలం 499 దరఖాస్తులను పరిష్కరించారు. ఇక మిగిలిన వాటిని ఈ నెల చివరి వరకు పరిష్కరించడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. అధికారులను ఎవ్వరినీ కదిలించినా బదిలీల ప్రస్తావనే తప్పా ధరణి పెండింగ్ అప్లికేషన్ల గురించి మాట్లాడడం లేదు. కలెక్టర్ స్థాయిలో పరిష్కరించాల్సిన పాస్‌బుక్ డేటా కరెక్షన్లు(వెరిఫికేషన్ కోసం) ఆర్డీవో, తహసీల్దార్ల లాగిన్‌లోకి పంపించారు. తహసీల్దార్ల వద్ద 3,601, ఆర్డీవోల వద్ద 66, నాలా కన్వర్షన్‌కు సంబంధించి తహసీల్దార్ల వద్ద 329, ఆర్డీవోల వద్ద 21 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించి 697, పెండింగ్ మ్యూటేషన్లు 313, పాస్‌బుక్ లేని సక్సెషన్లు 690, కోర్టు కేసులు 57 మొత్తం కలెక్టర్ లెవల్ లోనే 1,759 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్డీవో స్థాయిలో కోర్టు కేసులు, ఇంటిమేషన్ 464, నాలా కన్వర్షన్ 18, ప్రభుత్వం సేకరించిన భూములకు సంబంధించి 87 మొత్తం 576.. తహసీల్దార్ల స్థాయిలో వివిధ సమస్యలకు సంబంధించి మొత్తం 370 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా నిర్మల్ జిల్లాలో 3,120.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 957 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ ఈ నెలాఖరులోగా పరిష్కరించడం సాధ్యం కాదని రెవెన్యూ అధికారులే చెప్తున్నారు. బదిలీలు చేశాకే ఈ స్పెషల్ డ్రైవ్‌లు పెట్టుకుంటే మంచిదని అభిప్రాయపడుతున్నారు. ఎంత హడావుడి చేస్తే అన్ని ఇబ్బందులు వస్తాయని, జాగ్రత్తగా చేసుకుంటే ధరణి వెబ్‌సైట్‌లోని సమస్యలన్నీ పరిష్కారమవుతాయని పేర్కొంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తే బాగుంటుందంటున్నారు.



**ధరణి పెండింగ్ దరఖాస్తులు**

| | |
|---|---|
| మంచిర్యాల | 6,751 |
| నిర్మల్ | 3,120 |
| ఆసిఫాబాద్ | 957 |

### చాలా రోజులుగా తిరుగుతున్నా..

*నాకు మా నాన్న నుంచి వచ్చిన భూమిలో రెండు గుంటలు పాస్‌బుక్‌లో ఎక్కలేదు. దాని కోసమని దరఖాస్తు పెడితే అధికారులు సర్వే చేయాలన్నారు. దానికి కూడా సిద్ధ పడ్డాం. కానీ.. సర్వే చేసేందుకు ఎవ్వరు రాలేదు. ఎప్పుడు వెళ్లినా వస్తామని చెప్తున్నారు తప్పితే రావడం లేదు. మొన్న కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడిగితే ఓ 10 రోజులు అయ్యాక చేసుకోండి. కొత్త అధికారులు వస్తారు. ఇప్పుడు మేం మొదలు పెట్టినా బదిలీ అయ్యాక మధ్యలో ఆగిపోతది అని చెప్పారు. సమస్యను పరిష్కరిస్తారని ఆశతో దరఖాస్తు చేసుకుంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా మా సమస్యలను పరిష్కరించాలి.*

*- సాదు వీరభద్రస్వామి, దొనబండ, హాజీపూర్ మండలం.*

# దేశీదారుకు అడ్డుకట్ట పడేనా!

**● మహారాష్ట్ర నుంచి జోరుగా జిల్లాకు రవాణా ● తనిఖీ కేంద్రాలు లేని మార్గాల గుండా తీసుకొస్తున్న వైనం ● ఇక్కడి వైన్స్‌లకు తగ్గుతున్న గిరాకీ**

**● తక్కువ ధర కావడంతో ఆసక్తి చూపుతున్న మద్యం ప్రియులు ● ప్రభుత్వ ఆదాయానికి గండి ● ఇటీవల కాగజ్‌నగర్‌లో 30 వేల బాటిళ్లు స్వాధీనం**

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : జిల్లా సరిహద్దున ఉన్న మహారాష్ట్ర నుంచి దేశీదారు విచ్చలవిడిగా జిల్లాలోకి అక్రమంగా రవాణా అవుతున్నది. కొందరు దీనినే వృత్తిగా ఎంచుకొని బస్సులు, రైళ్లలో ఇక్కడి బెల్టు షాపులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తక్కువ ధరకే దొరుకుతున్న దేశీదారును కొనుక్కునేందుకు మద్యం ప్రియులు ఆసక్తి చూపుతుండగా, ఇక్కడి వైన్స్‌లకు గిరాకీ పడిపోతుందంటూ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నాడు ఇటు నుంచి అటు.. ఇప్పుడు ఇటు..

జిల్లాలోని రెండు డివిజన్లలో 32 మద్యం దుకాణాలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మూడు బార్లు ఉన్నాయి. గతంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్, గడ్చిరోలి జిల్లాల్లో మద్య నిషేధం అమల్లో ఉండగా, సరిహద్దు మండలాలైన సిర్పూర్-టీ, కౌటాల, చింతలమానేపల్లి మండలాలతో పాటు బార్డర్‌లో ఉన్న వాంకిడి మండలంలోని కొన్ని మద్యం దుకాణాల నుంచి మహారాష్ట్రకు మద్యం సరఫరా అయ్యేది. దీంతో ఇక్కడున్న మద్యం దుకాణాలకు భారీగా డిమాండ్ ఉండేది. 2022, జూన్ నుంచి చంద్రాపూర్‌లో మద్య నిషేధం ఎత్తివేయగా, అక్కడి నుంచి దేశీదారును ఆసిఫాబాద్ జిల్లాలోకి సరఫరా అవుతున్నది. ఆబ్కారీశాఖ అధికారులు నిలువరించే ప్రయత్నం చేస్తున్నా వారి కళ్లుగప్పి దందా సాగిస్తున్నారు. దేశీదారు తక్కువ ధరకే లభిస్తుండడంతో దానిని కొనుక్కునేందుకు మద్యం ప్రియులు ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా ఇక్కడి మద్యం దుకాణాలకు గిరాకీ తగ్గి.. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది.



కాగజ్‌నగర్‌లో పట్టుబడ్డ దేశీదారు (ఫైల్)

### 90 ఎంఎల్.. రూ. 45కే..

మహారాష్ట్రలో దేశీదారు 90 ఎంఎల్ రూ. 45కే లభిస్తోంది. ఇక్కడ లభించే అదే పరిమాణంలోని మద్యానికి రూ. 90 వరకు ధర ఉంటుంది. పైగా ఇక్కడి మద్యంతో పోలిస్తే దేశీదారులో మత్తు ఎక్కువగా ఉంటోంది. దీంతో కార్మికులు, కూలీలు ఎక్కువగా దేశీదారువైపే మొగ్గుచూపుతుంటారు. ఇదే అదనుగా కొందరు ఈ అక్రమ దందాను కొనసాగిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. రైళ్లు, బస్సుల్లో సరుకుల తరహా సంచుల్లో ఇక్కడికి తీసుకొచ్చి బెల్టుషాపుల్లో విక్రయిస్తున్నారు. వాంకిడి మినహా ఎక్కడా తనిఖీ కేంద్రాలు లేకపోవడం అక్రమార్కులకు కలిసి వస్తోంది. అప్పుడప్పుడు అధికారులు దేశీదారును పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నా.. వారి కంటపడినవి మాత్రం అనేకం ఉంటున్నాయి.

### కాగజ్‌నగర్‌లో జోరుగా విక్రయాలు

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో దేశీదారు విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. నాలుగు రోజుల క్రితం కాగజ్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్‌లో దేశీదారు నిల్వలున్నాయన్న సమాచారం మేరకు ఆబ్కారీ అధికారులు తనిఖీలు నిర్వహించగా, 90 ఎంఎల్ పరిమాణం కలిగిన దాదాపు 30 వేల దేశీదారు బాటిళ్లు దొరికాయి. వీటి విలువ సుమారు రూ. 1.50 లక్షలు దాకా ఉంటుందని ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. పొరుగున్న ఉన్న మహారాష్ట్ర నుంచి సిర్పూర్, చింతలమానేపల్లి మండలం గూడెం మీదుగా మహారాష్ట్ర నుంచి దేశీదారు మద్యం పెద్ద ఎత్తున తరలివస్తుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ మార్గం నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేసేందుకు ఎక్కడా చెక్ పోస్టులు లేకపోవడంతో కొంత మంది దేశీదారు మద్యాన్ని రవాణా చేయడమే వ్యాపారంగా పెట్టుకున్నారు.



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

## నేరస్తులకు శిక్షపడేలా చేయాలి

**రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్**

మంచిర్యాల ఏసీసీ, జూన్ 18 : ప్రతి కేసులో సమగ్ర విచారణ జరిపి నేరస్తులకు న్యాయస్థానం ద్వారా శిక్షపడేలా చేయాలని రామగుండం పోలీస కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్‌తో కలిసి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ప్రతి కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే బాధితులకు వెంటనే న్యాయం చేసేలా కృషి చేయాలన్నారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ విధులపై అవగాహన ఉండాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి(బ్లాక్ స్పాట్స్), నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాల విక్రయాలతో పాటు రవాణాకు పాల్పడుతున్న వారిపై దృష్టి పెట్టాలని, గంజాయి, పొగాకు ఉత్పత్తుల అమ్మకాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సికిల్ సెల్ నిర్మూలన పక్షోత్సవాలు

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, జూన్ 18 : ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి జూలై 3వ తేదీ వరకు పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఎంహెచ్‌వో అనితతో కలిసి పక్షోత్సవాల గోడ ప్రతులు, కరపత్రాలను, బ్యానర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ 149 ఉప కేంద్రాలు, 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె, బస్తీ దవాఖానాలకు గోడ ప్రతులు, కరపత్రాలు, బ్యానర్లు పంపించి ఆశ కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి ఫయాజ్, డాక్టర్ నీరజ, ఎన్‌హెచ్ఎం డీపీవో ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారులు నాందేవ్, సత్యనారాయణ, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బ్యానర్లు, గోడ పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

### నులి పురుగుల నిర్మూలనకు చర్యలు

నులి పురుగుల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీఎంహెచ్‌వో అనితతో కలిసి ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులు, కరపత్రాలు, బ్యానర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20న అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు. జిల్లాలోని 2,01,143 మంది పిల్లలకు మాత్రలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఫయాజ్,నీరజ, డీపీవో ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సత్యనారాయణ, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మంచిర్యాల,జూన్ 18: ఈ నెల 20 నుంచి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పాత మంచిర్యాల వైద్యాధికారి డా. శివప్రతాప్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బందికి నులిపురుగుల నిర్మూలనపై అవగాహన నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ మాత్రల వల్ల పిల్లల్లో రక్తహీనత, శారీరక, మానసిక అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగులు నశిస్తాయని పేర్కొన్నారు. రాజీవ్‌నగర్ వైద్యాధికారి డా. అశోక్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, సీహెచ్‌వో దీక్షితా రాణి, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.


• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679